



పార్కింగ్ ప్రదేశంలో పెద్ద సంఖ్యలో వాహనాలు



రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశ, విదేశాలతో పాటు, రాష్ట్రం నుంచి వచ్చిన ప్రముఖులతో సమ్మిట్ ప్రాంగణం రోజంతా సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడి, ఒగ్గు డోలు, మహిళల డప్పులు, పేరణి నృత్యం, కోలాటం తదితర కళారూపాలతో అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఉదయం నుంచే ఫ్యూచర్ సిటీ రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. తొలిరోజు దాదాపుగా 2 వేల మందికిపైగా అతిథులు హాజరయ్యారు.



సమ్మిట్ ప్రాంగణంలో దేశ, విదేశ అతిథుల సందడి

రద్దీగా రహదారులు

అతిథులు, అధికారుల వాహనాలతో ఫ్యూచర్ సిటీ రోడ్లన్నీ రద్దీగా మారాయి. సోమవారం ఉదయం నుంచే అక్కడి చేరుకున్న రాష్ట్ర నలుమూలల నుంచి మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వాహనాలతో పాటు, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, 44 దేశాలకు సంబంధించి 154 మంది ప్రముఖుల రాకతో తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొత్తూరు గేట్ మీదుగా గ్లోబల్ సమ్మిట్ ప్రాంతం వరకు వాహనాలతో కిటకిటలాడింది. ప్రపంచ నలుమూలల నుంచి ఆర్థికవేత్తల రాకతో ఆదివారం రాత్రి నుంచి సుమారు 4వేల మంది పోలీస్ బలగాలు రంగంలోకి దిగారు. కందుకూరు, తుక్కుగూడలో కవాతు నిర్వహించారు. అనంతరం ఈ రెండు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకుని పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆకర్షణగా రోబో..

ఈ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అక్కడకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా రోబో హాయ్ సీఎం అంటూ పలకరించడం విశేషం. తిరిగి ముఖ్యమంత్రి కూడా రోబోకు హాయ్ చెబుతూ ముందుకు సాగారు.

సంబురంగా సమ్మిట్

తొలిరోజు అట్టహాసంగా ఆర్థిక సదస్సు

బారులుతీరిన దేశ, విదేశీ ప్రతినిధులు.. తెలంగాణ సంస్కృతితో ఆహ్వానం

- నయా నగర నిర్మాణానికి మేధోమథనం
- భవిష్యత్ ప్రాజెక్టులపై నిష్ణాతులతో చర్చాగోష్ఠులు
- పెట్టుబడులే లక్ష్యంగా కీలక ఒప్పందాలు



రంగారెడ్డి అర్బన్/కందుకూరు/షాద్‌నగర్/మహేశ్వరం/ఇబ్రహీంపట్నం/కొందుర్గు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో రాజధానికి అతి సమీపంలో మరో నయా నగర నిర్మాణానికి బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా' తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను రెండు రోజుల పాటు నిర్వహిస్తోంది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్‌పేట - బేగరికంచలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో సోమవారం నయా నగర నిర్మాణానికి ఆర్థిక మేధోమథనం జరిగింది. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రముఖ ఎంఎన్‌సీల ప్రతినిధులతో పాటు ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, ప్రముఖులతో చర్చాగోష్ఠులు చేపట్టింది. సదస్సుకు తొలిరోజు దాదాపుగా 2వేల మందికిపైగా అతిథులు హాజరయ్యారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మిట్‌ను

మిగతా 6వ పేజీలో...



సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినీ నటుడు నాగార్జున, మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు

పల్లెల్లో జోరుగా ప్రచారం

తొలివిడత సర్పంచ్ ఎన్నికల ప్రచారం నేడు ఆఖరు

- పోటాపోటీగా ప్రచారాలు
- నేతల సుడిగాలి పర్యటనలు
- క్యాంపెయిన్‌లో వ్యవసాయ కూలీలు



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తొలివిడత సర్పంచ్ ఎన్నికల ప్రచారం నేటితో ముగియనుంది. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారాలను కొనసాగిస్తున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు ఫోన్లు చేసి, ఓటు వేయడానికి రావాలని కోరుతున్నారు. ట్యాక్సీ కారు తీసుకుని రావాలని డబ్బులు పంపుతున్నారు. అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాలలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. వ్యవసాయ కూలీలు సైతం ఎన్నికల ప్రచారంలో బిజీ అయ్యారు. ఉదయం ప్రచారంలో పాల్గొనడానికి 300 నుంచి 500 రూపాయలు ఇస్తూ, భోజనాలు పెడుతున్నారు.

168 స్థానాలకు పోటాపోటీ

షాద్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గంలో 174 సర్పంచ్ స్థానాలు ఉండగా, వాటిలో 6 స్థానాలు ఏకగ్రీవమైనాయి. మిగిలిన 168 స్థానాలకు 530 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. అలాగే 1,530 వార్డు స్థానాల్లో 196 స్థానాలు ఏకగ్రీవమైనాయి. మిగిలిన 1,340 స్థానాలకు 3,379 మంది

మిగతా 8వ పేజీలో...

ఎలక్షన్ కిక్!

నూతనంగా ఏర్పాటైన మద్యం షాపులకు ఎన్నికల కిక్కు ఎక్కుతుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు రావడంతో మద్యం షాపులకు కాసుల పంటను పండుతుంది. గ్రామాలకు మద్యం జోరుగా సరఫరా అవుతోంది. ప్రచారంలో పాల్గొంటున్న ఓటర్లకు విస్కీ, బీర్లను తాగిస్తూ ఖుషీ చేస్తున్నారు. అయితే అనధికారంగా

మిగతా 8వ పేజీలో...

కలెక్టరేట్‌లో నేడు విగ్రహావిష్కరణ

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో నేడు (మంగళవారం) తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని డీపీఆర్వో బాలేశ్వరి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఉంటుందని ఆమె చెప్పారు.

పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం
- ఆమనగల్లులో 12 సర్పంచ్, 92 వార్డు స్థానాలకు ఎన్నికలు
- జిల్లా సహాయ ఎన్నికల అధికారి మాధురి

7

అమెరికాలో కిషన్‌నగర్ వాసికి అరుదైన గౌరవం

7

ఎస్ఐహెచ్ పోటీ కాదు.. ఇన్నోవేషన్ ఉద్యమం





మాట్లాడుతున్న ఏఐసీటీఈ డిప్యూటీ డైరెక్టర్ నిఖిత్‌కాంత్, విద్యార్థులు

- ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐహెచ్ (స్మార్ట్ ఇండియా హ్యాకథాన్) పోటీ కాదు.. ఇన్నోవేషన్ ఉద్యమమని ఐఐసీటీఈ చైర్మన్ సీతారాం అన్నారు. మానవ వనరుల అభివృద్ధి, మంత్రిత్వ శాఖ, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో ప్రపంచంలో అతి పెద్ద హ్యాకథాన్‌లలో ఒకటైన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌ను సోమవారం శంషాబాద్ సమీపంలోని వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ప్రారంభించారు. వర్చువల్‌గా సీతారాం, స్థానిక భౌతిక కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నిఖిల్‌కాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశంలోని 727 సంస్థలకు చెందిన 8160 మంది ఫైనలిస్టులు వర్చువల్‌గా పాల్గొన్నారు. విద్యార్థులే దేశ నిర్మాతలు అని సీతారాం అన్నారు. ఈ ఏడాది 72,165 ఆలోచనలు, 68,766 స్టూడెంట్ టీంలు, 271 సమస్యలు, చివరికి 1,360 ఉత్తమ టీంలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా 2993 మహిళా విద్యార్థులు, 53 ఆల్ గర్ల్ టీంలు పాల్గొనడం విశేషమన్నారు. ఏఐసీటీఈ 2025ను ఇయర్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌గా ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఏపీఎఫ్ ఫెలోషిప్ ద్వారా రూ.37,000 నెలవారీ స్టైఫండ్, రెండు సంవత్సరాల వరకు ప్రాజెక్టు ఫండింగ్ లభిస్తుందన్నారు. విద్యార్థులు తప్పక నమోదు చేసుకోవాలని కోరారు. డాక్టర్ నిఖిల్ కాంత్, వీసీఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీవీఆర్ రవీంద్ర మాట్లాడుతూ 11 రాష్ట్రాల నుంచి వచ్చిన 151 మంది విద్యార్థులు 25 టీంలుగా ఏర్పడి జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం సూచించిన ఐదు సమస్యలపై పరిష్కారాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్‌శుక్లా, డాక్టర్ సచిన్ అగర్వాల్, పూర్ణచందర్ గోలి, రాజేందర్, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంచనలత


రేపటి నుంచి జాతీయ సదస్సు

- ప్రిన్సిపాల్ కాంచనలత
- చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహణ

చేవెళ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10, 11వ తేదీల్లో భారతదేశం ఎస్‌డీజీ -16 శాంతి, న్యాయం, సమానత్వ సమాజాలను బలపర్చడం అనే అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత తెలిపారు. సోమవారం చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సదస్సులో శాంతి, ఆధునిక సవాళ్లపై చర్చించడానికి పండితులు, విద్యావేత్తలు, విధాన నిపుణులు, పరిశోధకులను ఒకే వేదికపై తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రారంభ సమావేశానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, మాజీ ఓఎస్‌డీ ప్రెస్ సెక్రటరీ సత్యనారాయణ సాహు, తెలంగాణ ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ఆర్.లింబాద్రిలు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని చెప్పారు. అలాగే 11వ తేదీన జరిగే వీడ్కోలు సమావేశంలో సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్, ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణ ప్రాంత కేంద్ర డైరెక్టర్ సీనియర్ ప్రొ. బి. సుధాకర్‌రెడ్డి, తెలంగాణ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ పి. బాలా భాస్కర్‌లు హాజరుకానున్నారని తెలిపారు. శాంతి, న్యాయం, సమానత్వం, సామాజిక అభివృద్ధిపై లోతైన చర్చను ప్రోత్సహించడానికి రూపొందించిన ఈ జాతీయ స్థాయి శాస్త్రీయ, సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ మహ్మద్ అబ్దుల్ మాలిక్, కవిత, కె. సూర్యనారాయణ, షాజహాన్‌సిద్ధిఖీ ఉన్నారు.


ఎన్నికల విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

- కలెక్టర్ నారాయణరెడ్డి



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందిని నియమించుటకు మూడవ విడతలో రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, కలెక్టర్ నారాయణరెడ్డిల సమక్షంలో పూర్తి చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ఈ ప్రక్రియ జరిగింది. జిల్లాలో నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వహించే 4,458 మంది ప్రిసైడింగ్ అధికారులను ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్లతో పోలింగ్ నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. రెండవ విడత మండలాల్లో పోలింగ్ సిబ్బందికి కేటాయించిన మండల కేంద్రాల్లో రెండవ విడత శిక్షణా తరగతులను నేడు (మంగళవారం) నిర్వహిస్తామని ఆయన చెప్పారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్‌తోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




మహేశ్వరం మెడికల్ కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కనీస వసతులు కల్పించాలి

కాలేజీ ఎదుట వైద్య విద్యార్థుల ఆందోళన

ఆదిభట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలో కనీస వసతులు కల్పించాలని విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని భారత్ ఇంజనీరింగ్ కాలేజీలోని అద్దె భవనంలో రెండేళ్లుగా కొనసాగుతుందని తెలిపారు. ఇందులో 100 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. అద్దె భవనంలో సౌకర్యాలు లేవని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అద్దె భవనంలో పరికరాలు లేకపోవడంతో ప్రాక్టికల్ కోసం కాలేజీ నుంచి 25 కిలోమీటర్ల దూరంలోని వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి వెళ్తున్నట్లు చెప్పారు. మూడు నెలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం.. రెండేళ్లు గడిచినా ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీకి వాహనం లేకపోవడంతో క్షేత్ర పర్యటనలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. మెడికల్ కాలేజీకి ప్రభుత్వ హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు హాస్టల్‌లలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎంతో కష్టపడి సీటు సాధిస్తే.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ల్యాబ్, తాగునీరు, సరైన సౌకర్యాలు లేవన్నారు. ఇప్పటికైనా మెడికల్ కాలేజీలో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



సంబురంగా సమ్మిట్

(ఐదో పేజీ తరువాయి)

ప్రారంభించి ప్రసంగించారు. ఉదయం 11 గంటల నుంచి అతిథుల రాక ప్రారంభమైంది. ఈ సదస్సుకు ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున, కే.కేశవ రావు, రంగారెడ్డి జిల్లా నుంచి పలువురు ప్రతినిధులు హాజరయ్యారు.

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా..

వీవీఐపీ పారిశ్రామికవేత్తలకు డీఎస్పీ స్థాయి అధికారితో భద్రత కల్పించారు. వీవీఐపీ పారిశ్రామికవేత్తలకు, సీనియర్ అధికారులకు ప్రత్యేకంగా యాక్సెస్ పాస్‌లు జారీచేశారు. సమ్మిట్ హాజరయ్యే ప్రతినిధులను ఆకట్టుకునేలా అత్యాధునిక టెక్నాలజీ హంగులు, రంగురంగుల జెండా మేళవింపుతో స్వాగతం పలికారు. అడుగడుగునా చారిత్రాత్మక కట్టడాల నమూనాలు, పర్యటక ప్రదేశాలను భారీ స్క్రీన్లతో ప్రదర్శించారు. అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బేగరికంచ వరకు విద్యుత్ దీపాలంకరణలతో కటౌట్లు, ఫ్లెక్సీలు, భారీ ప్రొజెక్టర్లతో ప్రదర్శించారు.

56 గ్రామాల్లో అనువుగా..

ఈ సందర్భంగా 2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించినట్టుగా వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో గ్రీన్ అగ్రికల్చర్, మహిళలు, యువతకు స్కిల్, ఐటీ, ఫార్మా, విద్యా, వైద్యం, పర్యాటకం, తదితర సంస్థలను నెలకొల్పే విజన్‌తో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మొత్తం 56 గ్రామాల్లో భూములు అనువుగా ఉన్న చోట ఒక్కో సంస్థను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం పక్కా ప్రణాళికను రూపొందించింది.

అతిథులకు అంతరాయం కలుగకుండా

సమ్మిట్‌కు హాజరయ్యే అతిథుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మొత్తం ఏడు ప్రాంతాల్లో పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేశారు. అతిథులు ఎక్కడ తమ వాహనాలను పార్క్ చేయాలన్న సమాచారంతో కూడి పాస్‌లు వారికి అందజేశారు. ప్రతీ పార్కింగ్ ఏరియాకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను కేటాయించారు. కోడ్‌ను స్కాన్ చేయడంతో ఆయా పార్కింగ్ స్థలాలకు వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. వీవీఐపీలు, వీఐపీలు వస్తున్న వాహనాలకు అంతరాయం కలుగకుండా పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మీర్ఖాపేట్‌లోని సమ్మిట్ జరిగే ప్రాంతం వరకు వేలాది వాహనాలు తరలిరావడంతో, అడుగడుగునా పోలీసులను అందుబాటులో ఉంచారు.



గ్లోబల్ సమ్మిట్ ముఖద్వారం వద్ద అతిథుల సందడి





గ్లోబల్ సదస్సు హైలెట్స్

- ఉదయం 10:30 గంటలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సదస్సుకు హాజరు
- 10:35 గంటలకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క రాక
- 11:00 గంటలకు మంత్రులు తుమ్మల, అజారుద్దీన్
- 11:35 గంటలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- 11:38 గంటలకు సినీ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తల రాక
- 11:40 గంటలకు ఉపముఖ్యంత్రి బట్టి విక్రమార్క
- 12:00 గంటలకు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్
- 12:45 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 12.55 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- 1.30 గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం
- 2:10 గంటలకు నగరానికి బయల్దేరిన గవర్నర్

గవర్నర్‌కు ఘన స్వాగతం

మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.55 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అక్కడకు చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

పాస్‌లు ఉంటేనే అనుమతి

గ్లోబల్ సమ్మిట్ వెళ్లే రహదారి మొదలుకుని ప్రాంగణం వరకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పాస్‌లు లేకుండా ఎవరినీ అనుమతించలేదు. ప్రతీ ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే ప్రాంగణం లోపలికి అనుమతించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే రహదారులను సైతం పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

ఫ్యూచర్‌సిటీలో భారీ పెట్టుబడులు: కేఎల్‌ఆర్



రాబోయే తరాలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో చేపడుతున్న ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపారని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ స్కిల్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీ, కమిషనర్ కార్యాలయ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. అలాగే రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ 13 నుంచి మీర్ఖాన్‌పేట వరకు, మీర్ఖాన్‌పేట నుంచి ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి వరకు రీజినల్ రింగురోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పారిశ్రామిక దిగ్గజాలకు ఘనస్వాగతం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 08 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి వస్తున్న పారిశ్రామిక వేత్తలు, డెలిగేట్స్‌కు సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో టూరిజం శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ సంస్కృతిక, సంప్రదాయలు ఉట్టిపడేలా అతిరథ మహారథులకు స్వాగతం పలికారు. అతిథులకు విద్యార్థినులు నృత్యాలు చేసుకుంటూ వెల్‌కం చెప్పారు. న్యూజిలాండ్, జింబాబ్వే, ఇంగ్లాండ్, అమెరికా వీరితో పాటు మరి కొన్ని దేశాల నుంచి దాదాపు 154 మంది పారిశ్రామిక వేత్తలు, డెలిగేట్స్ , వివిధ కంపెనీల ప్రతినిధులు ఎయిర్‌పోర్టు నుంచి కందుకూర్ మండలం మీర్ఖాన్‌పేట్‌లో ఉన్న గ్లోబల్ సమ్మిట్‌కు బయలుదేరి వెళ్లారు. వీవీఐపీలు రావడంతో ఎయిర్‌పోర్టులో సందడి నెలకొంది. శంషాబాద్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి సమ్మిట్‌కు వెళ్లే వరకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని పలువురు పారిశ్రామిక వేత్తలు అన్నారు.

వ్యక్తి అదృశ్యం



వినుమోన్(ఫైల్)

శంషాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కేరళ రాష్ట్రంలోని తిరువనంతపూర్‌కు చెందిన వినుమోన్ ఈ నెల 3న శంషాబాద్‌లోని హోటల్ ప్రైమ్ వద్ద అదృశ్యమయ్యాడు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతకగా ఫలితం లేకపోవడంతో సోమవారం వినుమోన్ భార్య స్మిత శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న నగదు, పాస్‌పోర్ట్‌లు అందజేత

శంషాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు పోగొట్టుకున్న నగదు, పాస్‌పోర్ట్‌లను ఎయిర్‌పోర్టు సిబ్బంది సోమవారం బాధితులకు అందించారు. జిద్దా నుంచి వచ్చిన ఎండీ.మక్సూద్ అలీ ఎయిర్‌పోర్టులో 20 గ్రాముల బంగారం, నగదు రూ.10 వేలు, పాస్‌పోర్టు, మొబైల్ ఫోన్ కలిగిన బ్యాగు, మరో ఇద్దరు రాహుల్ పాస్‌పోర్ట్, ధూపతి గోపి విద్యా ధృవీకరణ పత్రాలు గల బ్యాగులు పోగొట్టుకుపోయాయని ఇటీవలే ఎయిర్‌పోర్టులో పోలీసు అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించి గుర్తించిన నగదు, పాస్‌పోర్ట్‌లను ఆర్‌జీఐఏ ఎస్సై కనకమయ్య సమాపతి సోమవారం బాధితులకు అందించడంతో వారు ధన్యవాదాలు తెలిపారు.



నగదు, పాస్‌పోర్ట్ బ్యాగును అందిస్తున్న ఎస్సై కనకమయ్య సమాపతి



కొడంగల్‌లో పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

బొంరాస్‌పేట్: ఓటు హక్కు వినియోగించుకుంటున్న సిబ్బంది





మొదలైన పోస్టల్ ఓటింగ్

కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట్, డిసెంబర్ 8 ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11న ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఓటును వినియోగించుకుంటున్నారు. సోమవారం బొంరాస్‌పేట్, కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్‌లో అంగన్‌వాడీ కార్యక్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు తదితర ఉద్యోగులు మొదటి రోజు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. బొంరాస్‌పేట్‌లో మొదటి రోజు 21 ఓట్లు పడ్డట్లు ఎంపీడీవో వెంకన్న గౌడ్ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

ఒకరి అరెస్టు.. ఆటో సీజ్

యాచారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నిల వేళ మద్యం అక్రమ రవాణా కాకుండా పోలీసులు నిఘా పెంచారు. యాచారం మండలం బానుతండాకు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 19 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి పోలీసులు మాల్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బానుతండకు చెందిన జె.కిషన్(32) ఆటోలో మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆటోతో పాటు మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో హైదరబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధి బేగరికంచలో పోలీసులు పటిష్ట భద్రతాచర్యలు తీసుకున్నారు. యాచారం నుంచి కందుకూరుకు వచ్చి పోయే వాహనాదారులను ఇదే రహదారిపై అనుమతించారు. మీర్‌ఖాన్‌పేట రైతులకు పెద్దమ్మ ఆలయం వరకు పంట భూములుండడంతో రైతులను అనుమతించారు. పవర్‌గ్రిడ్ వద్ద బారికెడ్లతో కందుకూరు వరకు అనుమతించారు.



యాచారం మండలం మాల్ సమీపంలో పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు



నీళ్లపల్లిలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిల్‌పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రజా సంక్షేమానికి అనునిత్యం తపించే నాయకుడు సుధాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. తన వంతుగా గ్రామాభివృద్ధికి సహకారిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సమన్వయ కర్త కరుణంపురుషోత్తంరావు, ఏకాంబరి దేస్థానం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది సుదర్శన్‌రెడ్డి, చిన్న వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా సహాయ ఎన్నికల అధికారి మాధురి



ఆమనగల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 14న జరిగే పోలింగ్‌కు ఆమనగల్లు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా సహాయ ఎన్నికల అధికారి కుసుమ మాధురి తెలిపారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల ఏర్పాట్ల గురించి వివరించారు. మండలంలో 13 సర్పంచ్, 112 వార్డులకు కోనాపూర్ సర్పంచ్‌కు ఒకే నామినేషన్ రావడంతో బెల్లంకొండ శ్రీలత ఏకగ్రీవమయ్యారని, అలాగే 20 వార్డు స్థానాలు ఏకగ్రీవమైనట్లు పేర్కొన్నారు. ఎన్నికలు జరిగే 12 సర్పంచ్ స్థానాలకు 41 మంది అభ్యర్థులు, 92 వార్డులకు 278 మంది పోటీలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రతి వార్డుకు ఒక పోలింగ్ బూత్ చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి బూత్‌కు ఒక పీవో, ఒక ఏపీవోతో పాటు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఆమనగల్లు మండలంలో ఎన్నికల విధులకు సుమారు 400 మంది అధికారులు, సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్లు ఇప్పటికే మండల కేంద్రానికి చేరుకున్నాయని, పోలింగ్‌కు ముందు రోజే ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందజేస్తామన్నారు. 14న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పోలింగ్, 2 తర్వాత కౌంటింగ్ ప్రారంభించి ఫలితాలు వెల్లడించడంతో పాటు ఉప సర్పంచ్ ఎన్నిక జరుగుతుందని వివరించారు.

మాజీ ఎమ్మెల్యేల భేటీ

నారాయణరావు ఇంటికి పైలెట్ రోహిత్‌రెడ్డి
జిల్లాలో చర్చనీయాంశమైన ఇద్దరి నేతల కలయిక



మాజీ ఎమ్మెల్యే నారాయణరావు ఇంట్లో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల వేళ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి బషీరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు నివాసానికి వెళ్లడం చర్చనీయాంశమైంది. సోమవారం బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కాంగ్రెస్‌కు చెందిన నారాయణరావు ఇంటికి వచ్చారు. స్థానిక రాజకీయాలు, పంచాయతీ ఎన్నికల్లో గెలుపోటములపై కొంత సేపు చర్చించుకున్నారు. బషీరాబాద్ పంచాయతీ సర్పంచ్ బరిలో మహరాజుల కుటుంబం నుంచి ఎస్.వెంకటేష్ ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పైలట్ రోహిత్‌రెడ్డి నారాయణరావును కలువడంపై రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలను పలకరించగా మర్యాదపూర్వకంగా కలుసుకున్నామని, విశేషమేమిలేదని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పైలట్ వెంట బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి తదితరలు ఉన్నారు.

విపక్షాలను నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో కల్వకుర్తి నియోజకవర్గం అద్భుత ప్రగతి సాధించిందన్నారు. పంచాయతీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, బీజేపీలు కనుమరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, గూడూరు భాస్కర్‌రెడ్డి, భట్టు కిషన్‌రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, ఆనంద్, పర్వత్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మోతీలాల్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, బీచ్యానాయక్, బీక్యానాయక్, బోజ్జ సాయిరెడ్డి, నూదిని కొండల్ రెడ్డి, విజయ్, జక్కు అనంత రెడ్డి, గుర్రం కేశవులు, మండ్లీరాములు పాల్గొన్నారు.



ఇన్ముల్‌నర్వలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపెడుతాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, డిసంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపెడుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ, కొడిచర్లతండాలో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇన్ముల్‌నర్వలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, రేషన్‌కార్డులు, భూగర్భ మురుగునీటి కాల్వల నిర్మాణాలు వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. పార్టీ మద్దతుతో పోటీలో నిలిచిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అంతకుముందు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, సుదర్శన్‌గౌడ్, లింగంనాయక్, శంకర్‌నాయక్, బల్వంత్‌రెడ్డి, షిరాజ్, హమీద్, బాబుముదిరాజ్, బిచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో యువతే కీలకం



కులకచర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో యువత ఓట్లు కీలకం కానున్నాయి. వారు ఎటువైపు ఓట్లు వేస్తే ఆ అభ్యర్థి గెలిచే చాన్స్ ఎక్కువ కనిపిస్తోంది. ఇంట్లో తల్లిదండ్రులు సైతం అంతా పిల్లలదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో పంచాయతీ ఎన్నికలొస్తే అభ్యర్థులు గ్రామ, కుల పెద్దలను కలిసి మద్దతు కోరేవారు. పెద్దల మాటకు కట్టుబడి అంతా ఓటేసే వారు. అందుకు అభ్యర్థి కులాల వారీగా టెంట్ సమాను, డబ్బులు చెల్లించేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. పోటీలో నిలబడిన అభ్యర్థులు యువ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి శాయశక్తులు ఒడ్డుతున్నారు. యువత సైతం పంచాయతీ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి!

ఆస్పత్రి ఎదుట మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన



లావణ్య(ఫైల్)



లావణ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

శంకర్‌పల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతోనే లావణ్య మృతి చెందిందంటూ.. ఆమె కుటుంబీకులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. శేరిగూడ గ్రామానికి చెందిన వడ్డె లావణ్య(27) సోమవారం ఉదయం కళ్లు తిరిగి కింద పడిపోయింది. కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం శంకర్‌పల్లిలోని స్వరాజ్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించగా ఆమె ఆరోగ్యం కొద్దిసేపు నిలకడగానే ఉంది. అయితే ఆమె బాత్‌రూమ్‌కు వెళ్లి వస్తూ మళ్లీ కిందపడిపోయింది. వెంటనే వైద్యులు ఆమెకు సీపీఆర్ చేశారు. మెరు గైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో కుటుంబీకులు అంబులెన్స్‌లో సంగారెడ్డికి తరలిస్తుండగా ఆమె మార్గమధ్యలోనే మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే లావణ్య మృతి చెందిందంటూ ఆమె కుటుంబీకులు ఆరోపిస్తూ ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. మెరుగైన వైద్యం అందిస్తే లావణ్య బతికేదని విలపించారు. సమాచారం అందుకున్న శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ అక్కడకి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా ఆమెకు పిల్లలు చైత్ర, ప్రజ్ఞ శ్రీ, భానుప్రసాద్ ఉన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చేవెళ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. సోమవారం మల్కాపూర్ వార్డులో సద్దుల ఈశ్వరమ్మ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని, అనంతరం సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి నిరుపేదకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనే ప్రభుత్వం రూ.5లక్షలతో ఇళ్లు కట్టిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బక్కరెడ్డి యాదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మోసిన్, శివారాజ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్

ఘట్‌కేసర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాటాలు సాగించేది కమ్యూనిస్టులేనని సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. సోమవారం పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి హాజరై మాట్లాడారు. పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే కూల్చివేస్తున్న అధికారులు బడానేతల ఆదీనంలో ఉన్న భూములను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. పోచారం పరిధిలోని ఆర్జీకే కాలనీలో దివ్యాంగుల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఏడెకరాలు కేటాయించింది. అందులో మూడెకరాల్లో ఇళ్లు నిర్మించగా మిగిలిన రెండెకరాలు ఆక్రమణలకు గురైందని ఆరోపించారు. కార్యక్రమంలో జయచంద్ర, ఈశ్వర్, అన్వర్‌పాషా, సరిత, ఖదీర్, సదాశివ, మురళి, కిష్టయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలను పెంచుకోవాలి

ఆమనగల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చదువుతో పాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. కలలపై పట్టు సాధించాలని సూచించారు. సోమవారం కన్యకా పరమేశ్వరి ఆలయంలో శృతిలయ కల్చరల్ అకాడమి, వందేమాతరం ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థినులకు కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అకాడమి చైర్మన్ చిత్తరంజన్‌దాస్, మానవతా వ్యవస్థాపకులు డాక్టర్ రమ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాము హాజరయ్యారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ రవికాంత్, ప్రియ, ఆకాడమి ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, భాస్కర్, నాగేశ్ పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడదను అరికట్టాలి

ఆమనగల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ శంకర్‌కు వీధి కుక్కలు, కోతుల బెడదను అరికట్టాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్ మాట్లాడుతూ వీధుల్లో చిన్న పిల్లలు ఆడుకునే సమయంలో వీధి కుక్కల స్వైరవిహారంతో భయాందోళన చెందుతున్నారన్నారు. ఉదయం, రాత్రి వేళల్లో కాలనీల్లో గుంపులుగా సంచరిస్తూ దారి వెంబడి వెళ్లే వారిని వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. అదే విధంగా కోతుల బెడద అధికమైందని, ఇళ్లలోకి చొరబడి తినుబండరాలు తదితర వాటిని నాశనం చేస్తున్నాని వాపోయారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కల లక్ష్మణ్, కృష్ణ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో కిషన్‌నగర్‌వాసికి

అరుదైన గౌరవం

మిచిగాన్ రిపబ్లికన్ పార్టీ కోచైర్మన్‌గా సన్నీరెడ్డి



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మిద్దెల చిన్నారెడ్డి అలియాస్ సన్నీరెడ్డికి అమెరికాలో అరుదైన గౌరవం లభించింది. మిచిగాన్ రిపబ్లికన్ పార్టీ కోచైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బృందంలో సభ్యుడిగా తెలుగువాడు నిలిచాడు. 50 రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరిని కో-చైర్మన్‌గా ఎన్నుకుంటున్నారు. మిచిగాన్ రాష్ట్రం నుంచి సూచనలు, సలహాలు ఇవ్వడానికి సన్నీరెడ్డిని ఎన్నుకున్నారు. మిచిగాన్ రాష్ట్రంలో స్థిరపడిన సన్నీరెడ్డి ఇప్పటికే వెయిన్ స్టేట్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్‌గా పనిచేస్తున్నారు. 1994లో వెయిన్ స్టేట్ యూనివర్శిటీ నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ పొందిన సన్నీరెడ్డి అదే యూనివర్శిటీకి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్‌గా ఎన్నికకావడం విశేషం. ఇటీవల తన సొంత గ్రామమైన కిషన్‌నగర్‌కు వచ్చి, ఆగ్రామ శివాంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. సన్నీరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు అగ్రరాజ్యంలో కో-చైర్మన్‌గా నిలపడంతో షాద్‌నగర్ ప్రాంతవాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు వ్యతిరేకంగా విత్తన బిల్లు



శామీర్‌పేటలో విత్తన సవరణ బిల్లు పత్రాలను కాల్చివేస్తున్న నాయకులు

శామీర్‌పేట/కొడంగల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా విత్తన బిల్లును ప్రవేశపెట్టడం దారుణమని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మలానరసింహ అన్నారు. సీపీఐ సంయుక్త కిసాన్ మోర్చ(ఎస్‌కేఎం) పిలుపు మేరకు సోమవారం శామీర్‌పేట మండల కార్యాలయాల సమీపంలో నాయకులు ముసాయిదా విత్తన బిల్లు - 2025ను వ్యతిరేకిస్తు పత్రాలను కాల్చివేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి నరేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దశరథ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల వెంకట్‌రెడ్డి, సాయిలుగౌడ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

ఆహార భద్రతను, విత్తన స్వావలంబనను దెబ్బతీసేలా విత్తన ముసాయిదా బిల్లు ఉందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్ అన్నారు. సోమవారం కొడంగల్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో ముసాయిదా బిల్లు పత్రాలను దహనం చేశారు. భారత విత్తన రంగంపై బహుళ జాతి సంస్థల ఆధిపత్యాన్ని పెంచేలా ప్రమాదకరంగా బిల్లు ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాబు, లాలయ్య, చంద్రయ్య, సావిత్రమ్మ, మహిబూబ్‌అలీ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కడ్తాల గ్రామాభివృద్ధి

● కడ్తాల పంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి



ఇల్లిల్లు తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్న రాయికంటి భిక్షపతి, నాయకులు

కడ్తాల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కడ్తాల్ సర్పంచ్‌గా తనను గెలిపిస్తే ప్రజల ఆకాంక్షలకనుగుణంగా గ్రామాభివృద్ధికి పాటుపడతానని కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి అన్నారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేలా కృషిచేస్తానని చెప్పారు. కడ్తాల సర్పంచ్ అభ్యర్థి భిక్షపతి సోమవారం వివిధ వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తన ఎన్నిక సింబల్ అయిన కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, ప్యాక్స్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మాలె మల్లేశ్ గౌడ్, కాంగ్రెస్ ఇతర నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. కుల, మహిళ, యువజన సంఘాలను కలిసి ఒక్కసారి తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నారాయణ రెడ్డి, ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ నేతల సహకారంతో కడ్తాల పంచాయతీలోని 14 వార్డుల్లో పూర్తి స్థాయిలో పైప్‌లైన్లు వేయించి మిషన్ భగీరథ నీరు అన్ని ఇళ్లకు సక్రమంగా వచ్చేలా చూస్తానని చెప్పారు. వార్డుల్లో ఇళ్ల మధ్య, రోడ్ల పక్కను న్న విద్యుత్ స్తంభాలను తొలగించి సిమెంట్ పోల్స్ పాతిస్తానని, ఇళ్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ లైన్లను తొలగించి ఇళ్లకు దూరంగా వేసేలా కృషిచేస్తానని చెప్పారు. కడ్తాలలో 30బెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయించి రోగులకు ఉన్నత మైన వైద్యసేవలు అందుబాటులోకి తెస్తానని భిక్షపతి ప్రజలకు హామీ ఇచ్చారు. అన్ని చెరువు, కుంటలను సుందరీకరిస్తామని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. మహిళా సంఘానికి భవన నిర్మాణం చేపడతామని, బస్టాండ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జహంగీర్ అలీ, రాంచందర్‌నాయక్, బోసు రవి, క్యామ రాజేశ్, జహంగీర్ బాబ, సత్యం, మంకి శ్రీను, శ్రీకాంత్, రమేశ్, బుచ్చయ్య, యాదగిరిరెడ్డి, చందోజీ, నరేశ్, యాదయ్యగౌడ్, జయసుధ, సుగుణమ్మ, సంధ్య, గీత, స్వాతి, మంజుల, పింకీ పాల్గొన్నారు.



భిక్షపతిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

శేఖర్‌యాదవ్‌ను గెలిపించుకొని గ్రామాభివృద్ధి చేసుకోండి

● నర్కూడ ఎన్నికల ప్రచారంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



నర్కూడలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ తన్వీరాజు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో నర్కూడ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ మద్దతుదారు గడ్డం శేఖర్‌యాదవ్‌ను గెలిపించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ప్రచారంలో భాగంగా సోమవారం కాలనీల్లో పర్యటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి సంక్షేమ పథకాలు అమలుకు ఆ పార్టీ మద్దతుదారుడినే గెలిపించాలని ఆయన కోరారు. ఇప్పటికే ప్రభుత్వం గ్యారెంటీలు అమలు చేస్తోందని తెలిపారు. మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్లుగా ఇవ్వని రేషన్ కార్డులను కాంగ్రెస్ సర్కారు ఇచ్చిందని చెప్పారు. సర్పంచ్ అభ్యర్థి గడ్డం శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ.. నర్కూడకు అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేశానన్నారు. గ్రామ ఆడ బిడ్డ పెళ్లికి సొంతంగా పుస్తెమట్టెలు, రూ.25వేల సాయం చేస్తామన్నారు. గ్రామంలో నీటి సరఫరా గంట నుంచి రెండు గంటలకు పెంపు, గ్రామంలోని కుటుంబ పెద్దకు 5లక్షల బీమా, వైద్య శిబిరాలు, లీగల్ క్యాంపులు, పారిశుధ్యం, రోడ్ల నిర్మాణం, సీసీ కెమెరాల నిర్వహణ, గ్రంథాలయం ఏర్పాటు వంటి పనులతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానాని శేఖర్‌యాదవ్ అన్నారు. అవకాశం ఇస్తే సేవలు అందిస్తానాని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే, మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. భారీ మెజారిటీతో గెలిపిస్తామంటూ ప్రజలు తనను ఆశీర్వదిస్తున్నారని గడ్డం తెలిపారు. వచ్చే ఐదేళ్లలో నర్కూడను అదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. సర్పంచ్‌గా గెలిపిస్తే 50పడకల ఆస్పత్రి, విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండతో నిధులు తెచ్చి గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తానని చెప్పారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, చాల మందికి కొత్త పింఛన్లు ఇచ్చామని సర్పంచ్‌గా గెలిపిస్తే మరిన్ని ఇళ్లు, పింఛన్లు తెస్తామని చెప్పారు. నీరటి తన్వీరాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్న సహకారంతో గ్రామానికి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పారు. గతంలో తాను జడ్పీటీసీగా గ్రామానికి ఎన్నో నిధులు తెచ్చానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి భారీగా నిధులు రాబట్టి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.





ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న గడ్డం శేఖర్

వేములనర్వను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి గాండ్ల విజయలక్ష్మి-అశోక్



గాండ్ల విజయలక్ష్మిఅశోక్

కేశంపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేములనర్వలో మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి గాండ్ల విజయలక్ష్మిఅశోక్ అన్నారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి వేములనర్వ, చౌదరిగూడ, బలిజరాళ్ల తండాలో ఇంటింటికి వెళ్లి ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. వేములనర్వ హ్యాబిటేషన్ గ్రామాలు బలిజరాళ్లతండా, చౌదరిగూడలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పిస్తానన్నారు. 20 ఏళ్ల కింది తాను వేసిన బోర్ల ద్వారానే నేటికీ తాగునీరు అందుతోందన్నారు. గ్రామంలో పరిశుభ్రత, పచ్చదనం, పరిశుభ్రత, తాగునీటికి ప్రాధాన్యమిస్తానన్నారు. 15రోజులకోసారి హెల్త్‌క్యాంప్ పెట్టించి ప్రజలకు వైద్యచికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటానాని హామీ ఇచ్చారు. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, వీధిలైట్లు, కూడళ్లలో హైమాస్ట్ వేయిస్తానన్నారు. ఉంగరం గుర్తుకు ఓటేయాలని కోరారు. నాయకులు అనురాధపర్వతరెడ్డి, మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగల అరెస్ట్

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. అందుకు సంబంధించి వివరాలకు సోమవారం విడుదల చేశారు. వికారాబాద్‌లోని రాజీవ్ గృహకల్పలో ఉండే కావలి సురేందర్(38), తాండూర్ మండలం నారాయణపూర్‌కు చెందిన కామె నర్సింలు(30) తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 7న ఆఫీసర్స్ కాలనీలో ఉండే కృష్ణ వేరే గ్రామానికి వెళ్లగా ఆయన భార్య మెయిన్ డోర్‌కు, గేట్‌కు తాళం వేసి అదే వీధిలో ఉండే టైలర్ షాప్‌నకు వెళ్లిందన్నారు. అదే సమయంలో ఈ దొంగలు డోర్ తాళం విరుగ్గొట్టి కబోర్డులోని బంగాం, నగదు ఎత్తుకపోయారని చెప్పారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి 3 తులాల బంగారు వస్తువులు, రూ.62వేల నగదు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తి ...

కడ్తాల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పల్లెచెలక తండాలో ఈ నెల 2న తండాకు చెందిన విస్లావత్ శంకర్ అనుచితంగా ప్రవర్తించాడని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి శంకర్‌ను అరెస్టు చేశామని సీఐ గంగాధర్ తెలిపారు. ఎవరైనా మహిళల పట్ల, బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లయితే చర్యలు తప్పవన్నారు.

అభివృద్ధే ధ్యేయం.. మార్పే నా లక్ష్యం



ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి వై.శ్రీనివాస్‌యాదవ్

కేశంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో గ్రామాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లామని, ఒక్కసారి తనను సర్పంచ్‌గా గెలినిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎక్లాస్‌ఖాన్‌పేట కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి ఎల్లనమోని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన ఇంటింటి ప్రచారంలో కత్తెర గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను కోరారు. గ్రామంలో 20ఏళ్లగా రాక్షస పాలన నడిచిందని, ప్రజలు స్వేచ్ఛగా ఉండాలంటే తనను సర్పంచ్ చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే శంకర్ సహకారంతో హైమాస్ట్ లైట్లు, డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. ప్రజలకు ఫిల్టర్ వాటర్ అందజేస్తానన్నారు. అన్ని వీధుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. క్రీడా ప్రాంగణంలో సౌకర్యాలు కల్పిస్తానన్నారు. అనారోగ్యానికి గురైన వారికి వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి డబ్బులిప్పిస్తానని తెలిపారు. ఎక్లాస్‌ఖాన్‌పేట, పొడగుట్టతండా ప్రజలు కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని శ్రీనివాస్ కోరారు. ప్రచారంలో పెంటయ్య, శ్రీధర్, కృష్ణశ్రీనివాస్, యాదయ్య, అంజయ్య, శ్రీనివాసులు, నరసింహ పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న వై.శ్రీనివాస్‌యాదవ్

జయప్రద గెలుపు నల్లేరు మీద నడకే

● ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తీగాపూర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బీఆర్ఎస్ తరఫున పోటీచేస్తున్న బీరంగూడ జయప్రదజగన్మోహన్ రెడ్డి గెలుపు 'నల్లేరు మీద నడకే' అని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. జయప్రదరెడ్డి తరఫున సోమవారం ఆయన ప్రచారం నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. జయప్రద గతంలోనూ సర్పంచ్‌గా పనిచేసి గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి ఆదర్శంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తిరిగి తనకు అవకాశం రావడంతో గ్రామస్తుల కోరిక మేరకు సర్పంచ్‌గా పోటీచేస్తున్నట్టు చెప్పారు. జయప్రద ఎన్నికల సింబల్ బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని నవీన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుపేదలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించారని గుర్తు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లా బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, గ్రామంలోని సమస్యలను పరిష్కారిస్తామని నవీన్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బి.జగన్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచులు రమాదేవిరమేశ్, నర్సింహులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.



తీగాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మైసిగండి సర్పంచ్ అభ్యర్థిని జటావత్ ప్రేమజవహర్‌లాల్‌నాయక్

మైసిగండి అభివృద్ధికి నిస్వార్థంగా పాటుపడతా

కడ్తాల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుణ్యక్షేత్ర గ్రామమైన మైసిగండి సర్పంచ్‌గా తనను గెలిపిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నిస్వార్థ సేవలందిస్తానని కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థిని జటావత్ ప్రేమజవహర్‌లాల్‌నాయక్ అన్నారు. ప్రజలకు సేవ చేసి మైసిగండిని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే తొలిసారిగా తాను సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నానని తెలిపారు. అభ్యర్థిని ప్రేమనాయక్ సోమవారం మైసిగండిలోని వివిధ వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. పీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ సిరోలిపంతూ, మాజీ సర్పంచ్ తులసీరాం, గ్రామ పెద్దలతో కలిసి కత్తెర గుర్తుకు ఓటేయాలని ప్రచారం నిర్వహించారు. జవహర్‌లాల్ మాట్లాడుతూ.. మైసిగండి గ్రామాభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి, బాధితులకు తోడ్పాటు అందించానని తెలిపారు. కాంగ్రెస్‌తోనే గ్రామాల ప్రగతి, అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, కాబట్టి మైసిగండి అభివృద్ధికి భారీగా నిధులు సాధిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు హీరాసింగ్, యమునచందర్, రవి, బాబులాల్, వినోద్, దోళి, బన్సీలాల్, శారదరాజు, దూద్య, అమర్‌సింగ్, అమ్మ, పాండు, శేఖర్‌గౌడ్, సుమన్, పత్య పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటూ కడ్తాల ప్రగతికి బాటలు వేస్తా

● కడ్తాల బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్



కడారి రామకృష్ణతో ఇంటింటి ప్రచారం చేస్తున్న బావండ్లపల్లి ఆనంద్

కడ్తాల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కడ్తాల సర్పంచ్‌గా ఒక్కసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపుతానని కడ్తాల బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ అన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు పేదల కష్టాలు, బాధలు తెలుసుని పేర్కొన్నారు. కడ్తాల బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బి.ఆనంద్ సోమవారం పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు గంప శ్రీను, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులతో కలిసి ఉంగరం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆనంద్ కోరారు. కులసంఘాల నేతలు, చిరు వ్యాపారులు, పేదలను కలిసి తమ సమస్యలు తెలుసుకొని వాటిపరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న కడ్తాలను అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శంగా నిలుపుతానని ఆయన పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడ్డ కాలనీల్లో ప్రజలకు అవసరమైన వసతులు కల్పించి ఇబ్బందుల్లేకుండా చూస్తానని ఆనంద్ హామీ ఇచ్చారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పాటు పడతానని చెప్పారు. గ్రామ సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలను కలుపుకొని ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తానని చెప్పారు. సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి, సొంత డబ్బుతో 108 అంబులెన్స్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వసతుల కల్పనకు శ్రామికుడిగా శ్రమిస్తానని ఆనంద్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని సూచించారు. బీఆర్ఎస్ ఏ పక్షంలో ఉన్నా ఎప్పుడూ ప్రజల పక్షమేనని పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.మహేశ్, వెంకటేశ్, చెన్నయ్య, శేఖర్, రాఘవేందర్, అంజి, మల్లేశ్, వెంకటేశ్, శ్రీనివాస్, జగన్ పాల్గొన్నారు.



గ్రామస్తులను ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్, నాయకులు

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



శంషాబాద్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామంజపూర్‌నకు చెందిన నర్సింహ-వరలక్ష్మి దంపతుల కుమారుడు దొబ్బ సుశాంత్ ఉరేసుకున్నాడు. గొడవల కారణంగా భార్యభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. సిద్ధాంతిలో ఉంటున్న వరలక్ష్మి వద్ద కుమారుడు గత దసరాకు తండ్రి వద్దకు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. సుశాంత్ సోమవారం ఇంట్లో బాధపడుతూ తాను ఓ అమ్మాయిని ప్రేమించానని, చనిపోతానంటూ కత్తితో చేతిపై కోసుకున్నాడు. చుట్టుపక్కల వారు చెప్పినా వినకుండా ఇంట్లోకి వెళ్లి తలుపేసుకొని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్థానికులు స్పందించే లోపే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, జరిమానా

శంకర్‌పల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దోపిడీ కేసులో ఇద్దరు నిందితులకు చేవెళ్ల ఫస్ట్‌క్లాస్ జూనియర్ సివిల్ జడ్జి 5నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. 2023 నవంబరు పటాన్‌చెరులోని ఆటోస్టాండ్ వద్ద జెల్‌పట్ శ్రీకాంత్,అలివేలు ఆటో మాట్లాడుకుని టంగటూరు శివారుకొచ్చారు. పథకం ప్రకారం ఆటో డ్రైవర్ మొయినుద్దీన్‌ను మల్లన్న ఆలయం వెనుకవైపు తీసుకెళ్లి దాడి చేశారు. అతడి వద్ద రూ.11వేలు, ఫోన్ లాక్కొని ఆటోతో పరారయ్యారు. డ్రైవర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. 2023 నవంబరు 14న ఇంద్రారెడ్డినగర్ ఓఆర్ఆర్ వద్ద నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు విచారించిన జూనియర్ సివిల్ జడ్జి నిందితులిద్దరికి 5నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ వివరించారు.

అవకాశమిస్తే కమ్మెట రూపు రేఖలు మారుస్తా

● ప్రచారంలో కమ్మెట సర్పంచ్ అభ్యర్థి బుడ్డ సతీష్‌గౌడ్



కమ్మెటలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి సతీష్‌గౌడ్



చేవెళ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):అందరికి అందుబాటులో ఉన్న తనను కమ్మెట ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించి ఒక్కసారి సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామ రూపురేఖలు మార్చుతామని కమ్మెట సర్పంచ్ అభ్యర్థి బుడ్డ సతీష్‌గౌడ్ తెలిపారు. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కమ్మెట మాజీ సర్పంచ్‌లు పెంటయ్య, రాంచంద్రయ్య, పి.హన్మంతరెడ్డి, తులసీరాజు, మాజీ ఎంపీటీ జంగయ్య తదితర నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం దూంధాంగా నిర్వహించారు. గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఆకట్టుకున్నారు. ప్రజలను కలిసి తన ఎన్నికల సింబల్ ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కమ్మెటలో నెలకొన్న ప్రధాన సమస్యలను రూపుమాపుతామన్నారు. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణం చేపడుతామన్నారు. ప్రజల సలహాలు, సూచనలు పాటించి అభివృద్ధికి బాటలు వేస్తానాన్నారు. ఓటర్లు ఉంగరం గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. 2014 నుంచి 2018 వరకు కమ్మెటలో నీటి కొరత తో ప్రజల ఇబ్బందిని చూసి తన పొలం నుంచి తాగునీటి సరాఫరా చేశాన ని గుర్తు చేశారు. నాయకులు మాధవగౌడ్, పాండుగారెడ్డి, వెంకటేశ్, సుభాన్‌రెడ్డి, రామకృష్ణ, సుధాకర్, దర్శన్, కాంత్, రాజు, గోపాల్, జంగయ్య ఉన్నారు.

మొయినాబాద్ రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన మహిళ కుటుంబానికి మాజీ సర్పంచ్ రత్నం ఆర్థికసాయం చేశారు. మోత్కుపల్లిలో పెంటమ్మ సోమవారం మృతిచెందింది. రత్నం ఆమె కుటుంబానికి సాయం అందజేశారు.

పల్లెల్లో జోరుగా ప్రచారం

(ఐదో పేజీ తరువాయి)

అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సర్పంచ్ స్థానాలకు ద్విముఖ, త్రిముఖ పోటీ ఉంది. నియోజకవర్గంలోని 168స్థానాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుదారులు పోటీ చేస్తుండగా 29స్థానాల్లో మాత్రమే బీజేపీ మద్దతుదారులు పోటీలో ఉన్నారు. కొన్ని స్థానాలకు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల మధ్యే గట్టిపోటీ నెలకొనడం గమనార్హం.

నేతల సుడిగాలి పర్యటనలు

పార్టీ మద్దతుదారుల విజయానికి ప్రజాప్రతినిధులు, పార్టీల నేతలు సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ప్రచార గడువు నేటితో ముగుస్తుండడంతో కాంగ్రెస్ మద్దతుదారుల కోసం ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మద్దతుదారుల కోసం ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

ఎలక్షన్ కిక్!

(ఐదోపేజీ తరువాయి)

గ్రామాల్లో మద్యం డంపులు టచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

మూడు రోజుల్లో రూ.11.71 కోట్లు..

షాద్‌నగర్ ఎక్సైజ్ సబ్‌డివిజన్‌లో 28మద్యం షాపులు, ఐదు బార్లు ఉన్నాయి. షాద్‌నగర్‌లో 14షాపులు, కొత్తూర్‌లో 5, కేశంపేటలో 3, నందిగామలో 2, కొందుర్గులో 2, చౌదరిగూడలో 2 వైన్స్‌లు ఉన్నాయి. షాద్‌నగర్‌లో నాలుగు, కొత్తూర్‌లో ఒక్క బార్లు ఉన్నాయి. షాపులు, బార్లలో అక్టోబరులో రూ.31.26కోట్లు, నవంబరులో రూ.34.63 కోట్లు, డిసెంబరు ఒకటి నుంచి మూడో తేదీ వరకు రూ.11.71కోట్ల మందును ఆర్డర్ చేశారు. కొత్త షాపులు ప్రారంభమైన మూడు రోజుల్లోనే రూ.11.71కోట్ల మందును లిఫ్టు చేయడం విశేషం. డిపో నుంచి నేరుగా గ్రామాలకు తరలుతోంది. పల్లెల్లో భారీగా మద్యం డంప్ అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం

● పెద్దషాపూర్ సర్పంచ్ అభ్యర్థి సునీత



పెద్దషాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి దేవులపల్లి సునీతసత్యనారాయణగౌడ్



అన్నా.. నీ ఓటు నాకే వేయాలి అని ప్రచారం నిర్వహిస్తున్న డి.సునీతసత్యనారాయణగౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానాని పెద్దషాపూర్ సర్పంచ్ అభ్యర్థి దేవులపల్లి సునీతసత్యనారాయణగౌడ్ అన్నారు. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను తప్పక నెరవేరుస్తానని చెప్పారు. అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. తనకు అన్ని వర్గాల మద్దతు కావాలని కోరారు. గతంలో సర్పంచ్‌గా చేసి ఎన్నో అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. తన ఎన్నికల సింబల్ కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే పెద్దషాపూర్‌ను అదర్శ పంచాయతీగా తీర్చిదిద్దతామని చెప్పారు. మహిళలకు పింఛన్లు, రేషన్‌కార్డుల సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దుతాను అని చెప్పారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. ఇప్పటికే గ్రామ ఆలయంలో సొంత డబ్బుతో మార్బుల్ వేయించామని గుర్తు చేశారు. ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఎన్నికల్లో కత్తెర గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు. కత్తెర గుర్తు చూపుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గాదె రాజశేఖర్, రామువీర్ పండిట్, దేవులపల్లి నర్సింహ, శ్రీశైలంయాదవ్, యువ నాయకులు జిల్లా జగదీష్, కపిల్‌దేవ్, విశాల్, రామ్మోహన్, కుక్కల నర్సింహ, బొర్ర చంద్రశేఖర్, ఉదయ్‌గౌడ్, శ్రీధర్‌బాబు, గౌస్ పాషా, కర్రె శ్రీనివాస్, యాదయ్య, రాజు, జె.శ్రీనివాస్, కిషోర్, జేమ్స్, నవీన్, ఆనంద్, సాయి తదితరులు పాల్గొన్నారు.



కిరణా దుకాణం యజమానికి కత్తెర గుర్తు చూపుతూ ఓటు అభ్యర్థిస్తున్న సునీత

ఫార్మాసిటీ భూములను ఫ్యూచర్ సిటీకి కేటాయించొద్దు

యాచారం,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఫ్యూచర్ సిటీకి తీసుకోవడం చట్టరీత్యా చెల్లదని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి ఓ ప్రకటనలో అభ్యంతరం తెలిపారు. ప్రాజెక్టు నివేదికను ప్రజలకు వివరించి ప్రజాభిప్రాయసేకరణ చేయాలని కోరారు. ఫార్మాసిటీ భూములను పరిశ్రమల అదిపతులకు అప్పగించాలనుకోవడం సరికాదని ఆమె పేర్కొన్నారు.